క్లుప్తంగా

జిల్లా జడ్జిని కలిసిన బార్ సభ్యులు



వసంత్ పాటిల్‌ను కలిసిన బార్ సభ్యులు

ఇల్లెందు: ఇల్లెందు నూతన బార్ అసోసియేషన్ సభ్యులు జిల్లా జడ్జిని మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం కొత్తగూడెంలోని కోర్టు హాల్‌లో వసంత్ పాటిల్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువతో సత్కరించారు. నూతన బార్ సభ్యులను అధ్యక్షుడు కె.ఉమామహేశ్వర రావు పరిచయం చేశారు. కీర్తి కార్తీక్, ఖాసీం, నవీన్‌కుమార్, వినోద్ తదితరులు ఉన్నారు.

జాతీయ స్థాయిలో రాణించిన విద్యార్థిని



వర్షిత

జూలూరుపాడు: మాచిరాజు సీతారామయ్య, రత్నకు మారి దంపతుల స్మారక బడిపిల్లల కథల పోటీల్లో పాపకొల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న భూక్యా వర్షిత జాతీయ స్థాయిలో రెండో బహుమతి సాధించింది. ఈ విషయాన్ని గురువారం స్థానిక విలేకరులకు హెచ్‌ఎం ఎస్కే మీరా సాహెబ్ తెలిపారు. సికింద్రాబాద్ మాచిరాజు బాల సాహిత్య పీఠం వారు జాతీయ స్థాయిలో బాలల కథల పోటీలు–2025 నిర్వహించారు. ఈ పోటీలో వర్షిత రాసిన జంక్ ఫుడ్ తింటే.. అనే కథకు జాతీయ స్థాయిలో రెండో స్థానంలో నిలిచింది. వర్షితను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

కార్మికులకు న్యాయం చేయాలి

పాల్వంచ: కేటీపీఎస్ 6వ దశ నిర్మాణ కార్మికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని నిర్మాణ కార్మికుల జేఏసీ చైర్మన్ హతీరాం అన్నారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ... గతంలో రాష్ట్రంలో 23వేల మంది కాంట్రాక్ట్ కార్మికులను ఆర్టిజన్లుగా తీసుకున్నారని, అర్హులైన నిర్మాణ కార్మికులను విస్మరించారన్నారు. ఇటీవల కేటీపీఎస్‌కు వచ్చిన సీఎండీ సందీప్‌కుమార్ సుల్తానియా కలిసి వినతిపత్రం ఇచ్చామని, న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ జి.మురళీకృష్ణ, కన్వీనర్ భూక్యా లక్ష్మణ్ నాయక్, కోకన్వీనర్ ఆలేటి చంటి, వెంకటనారాయణ, వెంకటేశ్వర్లు, నవీన్‌కుమార్, రవి, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

‘శ్రీచైతన్య’ విద్యార్థుల ప్రతిభ

పాల్వంచ: స్థానిక కాంట్రాక్టర్స్ కాలనీలోని శ్రీ చైతన్య హైస్కూల్ విద్యార్థులు అంతర్జాతీయ టాలెంట్ సెర్చ్ ఒలింపియాడ్ ఫైనల్‌లో ప్రతిభ కనబరిచారు. ఇటీవల ప్రకటించిన ఫలితాల్లో 96 మంది విజయం సాధించారు. 6వ తరగతి విద్యార్థిని కోనిక శ్రీ ల్యాప్‌లాప్, 7వ తరగతి విద్యార్థి రిషిత ఫస్ట్ ప్రైజ్‌గా టాబ్లెట్ గెలుచుకున్నారు. అదేవిధంగా ద్వితీయ, రెండు తృతీయ, రెండు నాలుగో బహుమతులు, ఒక ఐదో బహుమతి, మెడల్స్, సర్టిఫికెట్లు అందుకున్నారు. వీరిని గురువారం స్కూల్‌లో జిల్లా విద్యాశాఖాధికారి వెంకటేశ్వరాచారి అభినందించారు. ఏజీఎం జయప్రకాష్, కోఆర్డినేటర్ వెంకట్, ప్రిన్సిపాల్ రమ్య, డీన్ మధు, సీఈ ఇన్‌చార్జ్ నాగబాబు పాల్గొన్నారు.

గుడిసెవాసుల నిరసన దీక్ష

ఇల్లెందురూరల్: తాము నివసిస్తున్న ప్రాంతంలో మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ మండలంలోని రాజీవ్‌నగర్ గుడిసెవాసులు సీపీఎం ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా నాయకుడు అబ్దుల్ నబీ, మండల కార్యదర్శి ఆలేటి కిరణ్ మాట్లాడుతూ.. ఆరు సంవత్సరాలుగా రాజీవ్ నగర్ శివారులో పేదలు గుడిసెలు వేసుకొని నివసిస్తున్నట్లు చెప్పారు. మౌలిక సౌకర్యాలు కల్పించకుండా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. ఇదే విషయమై ఆర్డీఓ మధుకు సీపీఎం నాయకులు వినతిపత్రం అందజేశారు. సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తామని ఆర్డీఓ హామీ ఇచ్చారు. ఇదిలా ఉండగా సమస్య పరిష్కారమయ్యే వరకు తాము ఉద్యమిస్తామని సీపీఎం నాయకులు పేర్కొన్నారు. మన్యం మోహన్‌రావు, సంతోష, కమల, వీరభద్రం, వెంకన్న పాల్గొన్నారు.

స్తూపావిష్కరణ సభను జయప్రదం చేయండి..

ఇల్లెందురూరల్: ఈ నెల 15న బయ్యారం మండలం గంధంపల్లిలో నిర్వహిస్తున్న న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ నాయకుడు ముక్తార్ పాషా స్మారక స్తూపావిష్కరరణ బహిరంగ సభను జయప్రదం చేయాలని ఆ పార్టీ డివిజన్ నాయకుడు తోడేటి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. రొంపేడు గ్రామంలో గురువారం బహిరంగ సభ ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఆజ్మీర శంకర్, సామేలు, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

అమ్మ పెట్టదు.. అడుక్కోనివ్వదు.. అన్న చందంగా ఉంది.. మండలంలోని 21పిట్ ఏరియా పరిధికి చెందిన విజయలక్ష్మీనగర్, తిలక్‌నగర్ గ్రామపంచాయతీలపై సింగరేణి సంస్థ తీరు. దశాబ్దాలుగా ఇక్కడే నివాసం ఉంటున్న ప్రజలను ఖాళీ చేయించే లక్ష్యంతో సింగరేణి సంస్థ ప్రయోగిస్తున్న ఆంక్షలను, అవరోధాలను అధిగమిస్తూ గత్యంతరం లేక శిథిలావస్థకు చేరిన ఇళ్లల్లో నివాసం ఉంటూ.. శిథిలమైన రోడ్లపై రాకపోకలు సాగిస్తూ, అసౌకర్యాలతో ఏళ్లుగా దుర్భర పరిస్థితిలో జీవనం సాగిస్తున్నారు.

శిథిలావస్థలో ఇళ్లు.. శిథిలమైన రోడ్లు..



కంకర తేలిన అంతర్గత రహదారి

- ఏళ్లుగా అసౌకర్యాలతో తప్పని సహవాసం
- వెంటాడుతున్న సింగరేణి ఆంక్షలు
- దయనీయ స్థితిలో రెండు పంచాయతీల ప్రజలు



21పిట్ ఏరియా వ్యూ

ఇల్లెందురూరల్: సింగరేణిలో తొలి కార్మికవాడగా 21పిట్ ఏరియా రూపుదిద్దుకుంది. కాలక్రమంలో ఈ ప్రాంతంలో గనులు మూతపడ్డాయి. ఈ ప్రాంతంలో కార్మికుల కోసం నిర్మించిన క్వార్టర్లు కూడా శిథిలావస్థకు చేరుకున్నాయి. ఆవిర్భావ సమయంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా సంస్థపై ఆధారపడి జీవనం సాగించిన కుటుంబాలే సుమారు 20 ఏళ్లకు పైగా నివాసం ఉంటున్నాయి. ఇలా క్వార్టర్లలో 379 కుటుంబాలు నివాసం ఉండగా, సంస్థకు చెందిన స్థలంలో ఇల్లు నిర్మించుకున్న కుటుంబాలు శేషగిరి బస్తీ, తిలక్‌నగర్‌లలో 220 వరకు ఉన్నాయి. ప్రస్తుతం క్వార్టర్లతోపాటు నివాస గృహాలు కూడా శిథిలావస్థకు చేరుకున్నాయి. ఆయా క్వార్టర్లు, నిర్మాణాలకు మరమ్మతు పనులు చేయకుండా కొంత కాలంగా సింగరేణి అధికారులు అడ్డుకుంటున్నారు. దీంతో నిర్మాణాలు ఎప్పుడు కూలుతాయో తెలియక రెండు గ్రామాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ జీవనం గడుపుతున్నారు.

నడవడానికి కూడా వీలు లేకుండా..

30 ఏళ్ల క్రితం 21పిట్ ఏరియా కార్మికులతో కళకళలాడుతున్న సమయంలో సింగరేణి సంస్థ క్వార్టర్లలో అంతర్గత రహదారులపై తారు రోడ్డు నిర్మించింది. కాలక్రమంలో రహదారులు పూర్తిగా ఛిద్రమయ్యాయి. కంకర తేలి ఒకచోట.. పెద్దపెద్ద గుంతలు ఏర్పడి మరోచోట అధ్వానంగా మారాయి. కనీస మరమ్మతులు లేక ప్రస్తుతం 21పిట్ ఏరియాలో అంతర్గత రహదారులు నడవడానికి కూడా వీలు లేకుండా పాడుబడినట్లు ఉన్నాయి.

ఇండస్ట్రియల్ విద్యుత్ బిల్లులు..

కార్మికులు నివాసం ఉన్న సమయంలో సింగరేణి సంస్థ క్వార్టర్లకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేపట్టింది. కార్మికులు ఇతర ప్రాంతాలకు బదిలీ కావడంతో పూర్వం సింగరేణి ఆధారపడి జీవించిన ప్రజలు వాటిని తాము తలదాచుకునే గూడుగా తీర్చిదిద్దుకున్నాయి. కానీ పొమ్మనలేక పొగబెట్టినట్లుగా క్వార్టర్లకు విద్యుత్తు సరఫరాకు తరచూ అంతరాయం కల్పించడంతో ఆగ్రహించిన ప్రజలు ఉద్యమం చేపట్టారు. ఫలితంగా ప్రతీ క్వార్టర్‌కు ప్రైవేటుగా మీటర్ ఏర్పాటు చేసి వారి నుంచి ఇండస్ట్రియల్ ధరతో విద్యుత్ బిల్లులను ముక్కు పిండి వసూలు చేస్తున్నారు. ఇలా ప్రతీనెల ప్రతీ కుటుంబం రూ.600 నుంచి రూ.2వేల వరకు బిల్లులు చెల్లిస్తున్నారు. మొత్తంగా 379 కుటుంబాలు ఇలా అదనపు విద్యుత్ బిల్లుల భారం తప్పడం లేదు. అంతేకాకుండా క్వార్టర్లకు సింగరేణి కరెంటు సరఫరా కారణంగా వారంతా ప్రభుత్వ ఉచిత విద్యుత్ పథకానికి దూరమయ్యారు.

ఆంక్షలే అవరోధంగా..

ఇటీవల జేకే ఉపరితల గని నిర్వాసిత ప్రాంత సర్వే సమయంలో శిథిలావస్థలో ఉన్న క్వార్టర్ల మరమ్మతులకు అవకాశం కల్పిస్తామని, అంతర్గత రహదారులను మెరుగుపరుస్తామని సర్వేకు హాజరైన సింగరేణి అధికారులే ప్రజలకు బహిరంగంగా మాటిచ్చారు. ఫలితంగా ఎటువంటి అవాంతరాలు లేకుండా సర్వే సాఫీగా సాగింది. సర్వే పూర్తైన వెంటనే గతంలో విధించిన ఆంక్షలను యథావిధిగా అమలు చేయడం ప్రారంభించారు. కనీసం చిన్న చిన్న మరమ్మతులకు కూడా అవకాశం ఇవ్వడం లేదు. అధ్వానంగా ఉన్న రహదారులను మెరుగుపర్చేందుకు వచ్చిన అవకాశాలను ముందుకు సాగనివ్వడం లేదు. ఇండస్ట్రియల్ కరెంటు స్థానంలో ప్రభుత్వ కరెంటు సరఫరా కోసం స్థానికులు చేసిన ప్రయత్నాలు సైతం సింగరేణి అధికారుల ముందు అరణ్యరోదనగానే మిగిలిపోయాయి.

సహనాన్ని పరీక్షించొద్దు..



జేకే ఓసీ నిర్వాసిత ప్రాంత సర్వేకు వచ్చిన అధికారులు ఇచ్చిన హామీలను ఒక్కటీ నిలుపుకోలేదు. శిథిలావస్థకు చేరుకున్న క్వార్టర్ల మరమ్మతుకు అవకాశం ఇవ్వడం లేదు. రోడ్లు మెరుగు పర్చలేదు. ప్రభుత్వ కరెంటు సరఫరా కూడా అడ్డు తగులుతున్నారు. ఇకమీదట కూడా మా సహనాన్ని పరీక్షిస్తామంటే ఉద్యమంతో సమాధానం చెబుతాం.

– పూనెం కవిత, మాజీ సర్పంచ్, విజయలక్ష్మీనగర్

హామీలు అమలు చేయాలి..



జేకే ఓసీ నిర్వాసిత ప్రాంత నిర్ధారణ సమయంలోనే ప్రజలంతా ఆగ్రహంతో ఉద్యమించారు. ప్రజలను శాంతింపచేయడానికి అనేక హామీలు ఇచ్చారు. కానీ నేడు ఒక్కటీ అమలు చేయకుండా గతంలో మాదిరిగానే ఆంక్షలు అమలు చేస్తూ ఇబ్బంది పెడుతున్నారు. ఆంక్షలను ఇలాగే కొనసాగిస్తే మరోమారు ఉద్యమం చేపడతాం.

– ధనసరి ప్రవంతి, మాజీ సర్పంచ్ తిలక్‌నగర్

వ్యాయామంతో ఆరోగ్యం, ఆనందం

టేకులపల్లి: వ్యాయామంతోనే ఆరోగ్యం, ఆనందం లభిస్తుందని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. ఈ మేరకు గ్యాస్ అథారిటీ ఇండియా లిమిటెడ్ (గెయిల్) ఆధ్వర్యంలో రూ.5లక్షల వ్యయంతో టేకులపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను ఆయన గురువారం ప్రారంభించారు. మాట్లాడుతూ... ప్రస్తుత బిజీ జీవితంలో అందరికీ వ్యాయామం తప్పనిసరి అన్నారు. ప్రతీరోజు అందరూ ఓపెన్ జిమ్‌ను సద్వినియోగం చేసుకుని ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. సీఐ టి.సురేష్, ఎస్ఐ పి.సురేష్, కోరం సురేందర్, బండ్ల రజిని శ్రీనివాస్, బోడ సరిత, రెడ్యానాయక్, కృష్ణయ్య పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత...

సీఎం రిలీఫ్ ఫండ్ నిరు పేదలకు వరం లాంటిదని వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. గురువారం టేకులపల్లి మండలంలో 74 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.22.32 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులని స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. భూక్యా దేవానాయక్, మోకాళ్ల పోశాలు తదితరులు పాల్గొన్నారు.



టేకులపల్లిలో ఓపెన్ జిమ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

బస్టాండ్ తనిఖీ..

ఇల్లెందు: వేసవిలో తాగునీటి కోసం అల్లాడుతున్న ప్రయాణికుల కోసం ఇల్లెందు ఆర్టీసీ బస్టాండ్‌లో ఆర్‌ఓ ప్లాంట్ ఏర్పాటు చేస్తానని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. గురువారం ఇల్లెందు ఆర్టీసీ బస్టాండ్‌ను ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా బస్టాండ్‌లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని ప్రయాణికులు వివరించారు. దీంతో నూతన ఆర్‌ఓ ప్లాంట్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించారు. అనంతరం మహాలక్ష్మి పథకం వల్ల ఉపయోగం ఉందా అని మహిళలను అడిగి తెలుసుకున్నారు. బస్టాండ్‌లో సమస్యలను ఆరా తీశారు.

అక్రమ నియామకాలపై విచారించండి..

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల అక్రమ నియామకాలపై విచారణ చేపట్టాలని, ఏఐటీయూసీ కొత్తగూడెం రీజియన్ కార్యదర్శి యర్రగాని కృష్ణయ్య, క్రిష్టోఫర్ డిమాండ్ చేశారు. గురువారం కొత్తగూడెం కార్పొరేట్ ఏరియా పరిధిలోని వర్క్‌షాపులో కాంట్రాక్ట్ కార్మికుల జనరల్ బాడీ సమావేశం జరిగింది. మాట్లాడుతూ... కార్పొరేట్ పరిధిలో వివిధ విభాగాలలో అవసరానికి మించి ఎక్కువ మంది కాంట్రాక్ట్ కార్మికులు ఉన్నప్పటికీ కొంతమంది ఉన్నతాధికారులు దళారులతో కుమ్మక్కై అక్రమంగా కాంట్రాక్ట్ కార్మికుల నియామకాలు చేపడుతున్నారని దీనిపై విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టి, సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గుర్రం శ్రీనివాస్, సంపత్, సుమన్, రాజేష్, మోహన్, రమేష్, కరీం, రమాదేవి, కనకలక్ష్మి, నాగరాజు, రాజేందర్, అనిల్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలి



జూలూరుపాడు: మాట్లాడుతున్న జయలక్ష్మి

జూలూరుపాడు: ప్రభుత్వ ఆస్పత్రుల్లో గర్భిణుల ప్రసవాల సంఖ్య పెంచాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ జయలక్ష్మి అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరిగిన ఆశా డే కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. గర్భిణులను గుర్తించి వారికి ఎంసీపీ కార్డు ఇచ్చి వ్యాక్సిన్, ఐరన్, ఫోలిక్, కాల్షియం మందులు ఇవ్వాలన్నారు. బరువులు, ఆహారపు అలవాట్లపై అవగాహన కల్పించాలని చెప్పారు. ఆస్పత్రికి తీసుకొచ్చి డాక్టర్‌చే వైద్య పరీక్షలు చేయించి, ప్రభుత్వ ఆస్పత్రిలోనే సాధారణ కాన్పుకు గర్భిణులను ప్రోత్సహించాలని ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలకు సూచించారు. మాతా శిశు కేంద్రాలను ఉపయోగించుకోవాలని, అదేవిధంగా తల్లీబిడ్డ క్షేమంగా ఉండాలంటే రెగ్యులర్‌గా వైద్యపరీక్షలు చేయాలన్నారు. తల్లిపాల ప్రాముఖ్యత, ఆహారం, పాలు ఇచ్చిన తరువాత తీసుకోవల్సిన జాగ్రత్తలను బాలింతలకు వివరించాలని పేర్కొన్నారు. ప్రత్యేక వ్యాధి నిరోధక టీకాల సర్వే నిర్వహించి, జాబితా తయారు చేయాలని తెలిపారు. 18 సంవత్సరాల లోపు పిల్లలందరికీ రక్త నమూనాల సేకరణ కార్యక్రమం జరుగుతున్నట్లు చెప్పారు. వేసవికాలంలో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యసిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ఆరోగ్య ఉపకేంద్రాలకు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎన్‌సీడీ పీఓ డాక్టర్ మధువరుణ్, మెడికల్ ఆఫీసర్ బి.వెంకటేశ్వర్లు, డాక్టర్ తేజశ్విని, సీహెచ్‌ఓ ఎం.రామకృష్ణ, హెల్త్ సూపర్‌వైజర్ రత్నకుమార్, హెచ్‌వీలు రాధిక, ప్రియదర్శిని, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పాల్వంచరూరల్: గర్భిణులు వందశాతం ప్రభుత్వాస్పత్రిలోనే కాన్పులు జరిగే విధంగా ఆశాలు, వైద్య సిబ్బంది చర్యలు తీసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ జి.సుకృత ఆదేశించారు. ఉల్వనూరులోని గిరిజన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆమె సందర్శించారు. ఆశాల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. గర్భిణులను డెలివరీ కోసం రామవరంలోని మాతాశిశు సంరక్షణ (ఎంపీహెచ్)కు తీసుకెళ్తే అక్కడ సిబ్బంది ఆశాలను ఇబ్బంది పెడుతున్నారని ఆశాలు డిప్యూటీ డీఎంహెచ్‌ఓ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆమె ఈ సమస్యను పునరావృతం కాకుండా కలెక్టర్, డీఎంహెచ్‌ఓల దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు తేజశ్రీ, దేవేంద్ర, మధుబాల, వినయ్, సీహెచ్‌ఓ కనకదుర్గ, హెచ్‌ఎస్ భీమాసింగ్, దేవి పాల్గొన్నారు.

తాగునీటి సమస్య రానివ్వొద్దు..

జూలూరుపాడు: వేసవి దృష్ట్యా తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) చంద్రమౌళి అన్నారు. గురువారం జూలూరుపాడు మండలంలోని పాపకొల్లు, గుండ్లరేవు, బేతాళపాడు గ్రామ పంచాయతీల్లో డీపీఓ పర్యటించారు. ఈ సందర్భంగా బేతాళపాడులో ఉపాధి పనులను ఆయన పరిశీలించి, కూలీలతో మాట్లాడారు. పని ప్రదేశాల్లో కూలీలకు తాగునీటి వసతి, సౌకర్యాలు కల్పించాలని సూచించారు. అదేవిధంగా డంపింగ్ యార్డు, నర్సరీతోపాటు, గుండ్లరేవులో మిషన్ భగీరథ నీటి సంపు, నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని పరిశీలించారు. మాట్లాడుతూ... గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని, నిరంతరాయంగా పారిశుద్ధ్య పనులు కొనసాగించాలని జీపీ సెక్రటరీలను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీఓ తులసీరామ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

పాల్వంచరూరల్: ఉన్నత చదువులు పూర్తి చేసుకున్న యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుని జీవితంలో స్థిరపడాలని జిల్లా ఉపాధి కల్పన అధికారి కె.శ్రీరామ్ అన్నారు. లక్ష్మీదేవిపల్లిలోని ప్రభుత్వ డిగ్రీ (అటానమస్) కళాశాల ప్రాంగణంలో పాల్వంచ కెరియర్ గైడెన్ సెల్, జిల్లా ఉపాధి కల్పన శాఖ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం జాబ్ మేళా నిర్వహించారు. కేపీఆర్ డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్, ముత్తూట్ మైక్రో ఫిన్ కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి ప్రతిభ కలిగిన అభ్యర్థులను ఎంపిక చేసుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధి కల్పన అధికారి మాట్లాడారు. కళాశాలలో ప్రతీ సంవత్సరం జాబ్‌మేళా ఉంటుందన్నారు.

ప్రజా నాయకుడు రజబ్‌అలీ

పాల్వంచ/సుజాతనగర్: ఆదర్శ కమ్యూనిస్టు, ప్రజా నాయకుడు, సుజాతనగర్ మాజీ ఎమ్మెల్యే మహ్మద్ రజబ్ అలీ అని సీపీఐ జిల్లా సమితి సభ్యులు బండ నాగేశ్వరరావు, పట్టణ సహాయ కార్యదర్శి ఉప్పుశెట్టి రాహుల్ అన్నారు. సీపీఐ కార్యాలయంలో గురువారం మహ్మద్ రజబ్ అలీ 29వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. పద్మజ, వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు పాల్గొన్నారు. సుజాతనగర్‌లో జరిగిన రజబ్ అలీ వర్ధంతి భూక్యా దస్రు, జక్కుల రాములు, కొమారి హనుమంతరావు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఉంటా..



మాట్లాడుతున్న కొత్వాల శ్రీనివాసరావు

పాల్వంచ: రైతులకు అందుబాటులో ఉండి, వారికి సేవ చేయడమే ధ్యేయంగా పాల్వంచ సొసైటీ పాలకవర్గం పనిచేస్తుందని రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్, సొసైటీ అధ్యక్షుడు కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. సొసైటీ కార్యాలయంలో గురువారం పాలకవర్గ సభ్యులు, వ్యవసాయ శాఖాధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. కొత్వాల మాట్లాడుతూ.. వారం రోజులుగా వర్షాలు కురుస్తున్న క్రమంలో వ్యవసాయ శాఖాధికారులు అందుబాటులో ఉండాలన్నారు. రైతులు సకాలంలో వడ్డీ చెల్లించి, వడ్డీ రాయితీని పొందాలన్నారు. యాసంగి ధాన్యం కొనుగోలుకు ఐదు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని, రైతులు 17తేమ శాతం మించకుండా కేంద్రానికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఏఓ పి.శంభోశంకర్, సొసైటీ వైస్ చైర్మన్ కాంపెల్లి కనకేష్, డైరెక్టర్లు బుడగం రాంమోహన్‌రావు, కనగాల నారాయణరావు, చౌగాని పాపారావు, జరబన సీతారాంబాబు, మైనేని వెంకటేశ్వరరావు, సామా జనార్దన్‌రెడ్డి, నిమ్మల సువర్ణ, ఏఈఓలు సత్యం, సుజాత, శాంతి, సొసైటీ సీఈఓ జి.లక్ష్మీనారాయణ, సురేందర్‌రెడ్డి, లక్ష్మి, శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోషణ పక్షం వేడుకలు

టేకులపల్లి: ఐసీడీఎస్ టేకులపల్లి ప్రాజెక్టు ఆధ్వర్యంలో మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ పక్షం వేడుకలు గురువారం ఘనంగా ప్రారంభం అయ్యాయి. ప్రాజెక్టు సీడీపీఓ కేఎం తార ముత్యాలంపాడు క్రాస్‌రోడ్‌లోని అంగన్‌వాడీ కేంద్రం, బోడు సర్కిల్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో వేడుకలకు హాజరయ్యారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు అవగాహన కల్పించారు. శిశువుల్లో ఇన్ఫెక్షన్ రాకుండా నివారించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. 3 సంవత్సరాల పిల్లలకు అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ సూపర్‌వైజర్ బి.నిర్మల, అంగన్‌వాడీ టీచర్ పద్మావతి, ఆయా లోకేశ్వరి పాల్గొన్నారు.



ముత్యాలంపాడు క్రాస్ రోడ్ అంగన్‌వాడీ కేంద్రంలో మాట్లాడుతున్న తార

‘సీతారామ’ నీళ్లు అందించాలి

జూలూరుపాడు: సీతారామ ప్రాజెక్టు నీళ్లు జూలూరుపాడు మండలానికి అందించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కొండపల్లి శ్రీధర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం జూలూరుపాడు సీపీఎం పార్టీ కార్యాలయంలో జరిగిన ఆ పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం సీతారామ నీళ్లు జూలూరుపాడు మండలానికి అందించేలా డిజైన్ చేస్తే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం జిల్లాలో అంతర్భాగమైన మండల రైతాంగానికి చుక్క నీరు ఇవ్వకుండా ఖమ్మం జిల్లాకు తరలించడం ఎంత వరకు సమంజసమన్నారు. సీతారామ ప్రాజెక్టు కెనాల్ కింద భూములు కోల్పోయిన రైతులకు సరైన నష్టపరిహారం కూడా ఇవ్వలేదన్నారు. యాసా నరేష్, బానోత్ ఇస్రా, వల్లమల్ల చందర్‌రావు, గార్లపాటి వెంకటి, గడిదేశి కనకరత్నం పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ మహాసభలను జయప్రదం చేయండి..

సింగరేణి(కొత్తగూడెం): ఈనెల 25, 26, 27వ తేదీలలో ఖమ్మంలో జరగనున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర 5వ మహాసభలను జయప్రదం చేయాలని సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మంద నాగ కృష్ణ, బయ్యా అభిమన్యు పిలుపునిచ్చారు. గురువారం రుద్రంపూర్‌లోని ప్రభుత్వ ఐటీఐలో జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. నాయకులు మాట్లాడుతూ... సంక్షేమ వసతి గృహాలలో చదువుకునే విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, కళాశాల, యూనివర్సిటీలలో చదువుకునే విద్యార్థులకు స్కాలర్‌షిప్, ఫెలోషిప్‌ల సాధనే లక్ష్యంగా పోరాటాలు సాగిస్తున్నామన్నారు. చరణ్‌తేజ, రేవంత్‌కుమార్, లక్ష్మణ్, సాయి, శివ పాల్గొన్నారు.

ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయండి..



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఉమ

పాల్వంచరూరల్: ఆదివాసీలపై కేంద్ర ప్రభుత్వం కగార్ పేరుతో దాడులు, హత్యాకాండ జరుపుతోందని వెంటనే దానిని నిలిపివేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ కొత్తగూడెం సబ్ డివిజన్ కమిటీ నాయకురాలు వీరమళ్ల ఉమా డిమాండ్ చేశారు. రెడ్డిగూడెం గ్రామంలో గురువారం అఖిల భారత రైతు కూలీ సంఘం, గ్రామ ముఖ్య కార్యకర్తల సమావేశం బుర్ర యాకయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని కోరుతూ ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ.. అడవుల్లో ఉన్న సహజ ఖనిజ సంపదను బీజేపీ ప్రభుత్వం బడా కార్పొరేటర్లకు దోచిపెడుతోందని దీనిని ప్రతిఘటిస్తున్న ఆదివాసీ గిరిజనులను హతమారుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల 25న కొత్తగూడెం జిల్లా కేంద్రంలో జరగనున్న సదస్సుకు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో అరుణ, రజిత, వెంకటమ్మ, భద్రమ్మ, సులోచన, సుభద్రారెడ్డి పాల్గొన్నారు.

పెంచిన గ్యాస్, పెట్రోల్ ధరలు తగ్గించాలి



ఇల్లెందు: గ్యాస్ ధరలు తగ్గించాలని ఆందోళన చేస్తున్న మాస్‌లైన్ నాయకులు

కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్, డీజిల్, పెట్రోల్ ధరలు తగ్గించాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా, సీఐటీయూ, మాస్‌లైన్, సీపీఐ, సీపీఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో గురువారం ఆందోళన నిర్వహించారు. ఖాళీ సిలిండర్లతో నిరసన తెలిపి, ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. నాయకులు మాట్లాడుతూ.. వంట గ్యాస్ ధర పెంచడం వల్ల పేద, మధ్య తరగతి ప్రజలపై తీరని భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



సూపర్‌బజార్(కొత్తగూడెం): ఖాళీ సిలిండర్లతో నిరసన తెలుపుతున్న నాయకులు



సుజాతనగర్: నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు, స్థానిక మహిళలు



జూలూరుపాడులో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సీపీఐ నాయకులు



పాల్వంచ: కేఎస్‌పీ రోడ్‌లో నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు